

# మొదటి కథ

## బీనాదేవి


"మీకు అసలు కథలు రాయాలని బుద్ధి ఎలాపుట్టిందీ? మీ మొదటి కథేవిటి? మీ కథలకి ప్రోద్భల, ప్రోత్సాహాలు ఏవిటి?" అని చాలా మంది అడగడం రివాజు. అప్పుడు మా వారు ఇదంతా తన ప్రోత్సాహమేనన్న చూపొకటి నావేపు విసుర్తారు. కాని మా ఇద్దరిమధ్య దెబ్బలాటలకి సగం కారణం యీ దిక్కుమాలిన కథలే అని చాలా మందికి తెలీదు. "ఇదంతా నా ఖర్మ బాబుల్లారా" అని చెప్పాలని నాకు తరుచు అనిపించినా, "ఇది రాసిన సాడే తీన్ కథలకే యింత తలపొగరా" అనిపించుకోవడం నాకు మాత్రం యిష్టమా?

మనుషులు మారతారుట సహజంగా. ఇదీ మావారి ఉవాచే. నేనేం అసహజమైనదాన్ని కాను కాబట్టి, యీ మధ్య "పోనీ, పాపం. వాళ్ళంత అభిమానం(?)తో అడుగుతున్నారు కదా. ఏదో ఒకటి చెప్పకూడదా?" అనిపిస్తోంది.

నాకు బుర్రలో ఏదైనా పుట్టకపోవాలే కాని, పుట్టిందో, యింక మరి ఆపడం నాక్కూడా శక్యం కాదు. (నన్ను అందుకే మావారు "ఆడ రావణాసురుడ" నీ, "రావణాసురి" అనీ అంటుంటారు. అసలు నే నేదైనా రాద్దామనుకున్నా, చేద్దామనుకున్నా, ముందు అనుకునేది మా వార్ని తలుచుకోకూడదని. కాని అదేవిటో ఫర్బిడెన్ యాపిల్ లాగా మావారు నన్ను సాతాని దయ్యంలా వెంటాడుతారు.)

చాలా కథల్లాగే నా మొదటి కథ కూడా ఓ అబ్బాయి, ఓ అమ్మాయిల ప్రేమ కథే. అంతే కాకుండా అప్పట్లో లైలామజ్నూల తర్వాత మళ్ళీ అంతటి హృదయవిదారక విషాద గాథ లేదనే అనుకున్నాను. అనుకోవడమే కాకుండా అంత గొప్ప ట్రాజడీ రాసిన నన్ను నేనే భుజం చరుచుకున్నాను.

ఆ కథలో అమ్మాయి బావుంటుంది. చాలా బావుంటుంది. బాగులేని అమ్మాయిలు పెళ్ళికి పనికివస్తారేమో కాని ప్రేమకి ముఖ్యంగా కథల్లో రాణించరని అప్పుడు నే ననుకునేదాన్ని. అంచేత యీ అమ్మాయికి చాలా అందంవుంది. జరీ, పాములా మిలమిల్లాడుతుంది. కర్పూరకాంతిలో దంతపు బొమ్మలా ధగ ధగ లాడుతుంది. ఆమె కళ్ళలో చుక్కల రాత్రుల తళుకులుంటాయి.ఆమె చూపులో వట్టివేళ్ళ చల్లదనం వుంటుంది. ఆమె సిల్కుచీర కట్టుకున్నా, చింకి చీర కట్టుకున్నా, రాజు కూతురిలా చాలా దర్జాగానూ, డిగ్నిఫైడ్‌గానూ వుంటుంది.




కథా ప్రారంభం నాటికి ఆమెకు పట్టుమని పదహారేళ్లు నిండలేదు. కాని ఆమె అప్పటికే ఫైనల్ బి. ఏ. ఇంగ్లీషు లిటరేచరుతో చదువుతూ వుంటుంది. కొందరు పిల్లలకి తల్లి కడుపులోనే పళ్లు వస్తాయిట. అంచేత యీ అమ్మాయికి కడుపులో వుండగానే "క, ఖ"లు వచ్చేశేయి. అంత తెలివైన పిల్ల. తెలివి తక్కువ పిల్లలు గొప్పవాళ్ళు కాలేరు. హీరోయిన్లు కాజాలరు. ఆ అమ్మాయి అందానికి అప్సరసైతే, చదువుకి సరస్వతి, బుద్ధికి బృహస్పతి. గొప్ప వాళ్ళకి బీదగుణా లుండకూడదు మరి.

ఆమే నా మొదటి కథానాయకి కాబట్టి, వాళ్ళది వాళ్ళ మూడంతస్తుల మేడంత ఉన్నతవంశం. వాళ్ళ డాడీకి మూడు కార్లున్నాయి. పాతిక లారీలున్నాయని ఎందుకు రాయలేదో నాకు తెలీదు. కారుకున్న స్టైల్ లారీకెక్కడిది?

కథల్లో వాళ్ళకి ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ కార్పొరేషన్సే వుంటాయి కాని మందులు షాపులూ, మందుషాపులూ వుండవు. జోళ్ళ షాపులు అసలేవుండవు.

ఇంక వాళ్ళ డాడీ ఎప్పుడూ పైపే కాలుస్తారు. అప్పుడప్పుడు పులుల్ని కూడా కాలుస్తారు. కోపంవస్తే స్ట్రైకు చేసిన కార్మికులనికూడా కాల్చిపారేస్తానని బెదిరిస్తారు. వాళ్ళ బంట్రోతుకూడా గోల్డ్‌ఫ్లేక్ తప్ప మరోటి ముట్టడు. డాడీ ఆరడుగుల పైనే వుంటారు. మూడడుగులున్నా కథకేం దెబ్బవుండేది కాదు. అతని దెబ్బ హీరోయిన్ తట్టుకొని వుండేదికాదు. కాని నాకేఁవిఁటో పొట్టి వాళ్ళంటే ఎలర్జీ. పైగా పొడుగుమనిషికి హుందా నిస్తుంది. అంచేత అతను ఆరడుగులు పైనే వున్నారు. అతని డబ్బంతా బేంకుల్లో దాచితే ఎన్ని బేంకులూ చాలవు. అసలతని ఇనప బీరువా స్టేట్‌బేంకంత వుంటుంది. పెద్ద అంతస్తు, తెల్ల ఆల్సేషియనూ, అతి మంచితనం, పరమకర్కశత్వం వున్న ఒక్క కూతురిమీదా పిచ్చిప్రేమా, కాబోయే అల్లుడు తన కన్నివిధాలా సమానుడు కావాలన్న మొండిపట్టు దలా కూడా వున్నాయి.

ఆ హీరోయిన్ అమ్మగురించిఎక్కువ రాయలేదుకాని ఆవిడ నా ఇమేజినేషన్లో నన్ను దెయ్యంలా పట్టుకుంది. ఆవిడ, వయసువచ్చి కాస్త నలిగిన దిండులా, కాస్త పాతబడ్డ మొఖమల్ దిండులా దర్జాగావుంటుంది. ఎప్పుడూ మొహంలో బోలెడు మంచితనం, యింకా బోలెడు దిగులుతో ఆవిడ ముసలి భారతమాతలా వుంటుంది. దిగులెందుకో నాకూ తెలీదు.

ఇంక హీరో కూడా అదే కాలేజీలో ఫైనల్ బి.యస్సీ. చదువుతూవుంటాడు. ఇతని పొడవూ ఆరడుగులు పైచిలుకే. టినోపాల్ పెట్టి ఉతికిన గ్లాస్కో చీరలా తెల్లగా మెరిసిపోతూ వుంటాడు. ఏదో పెద్ద బట్టల కంపెనీ ఎడ్వర్‌టైజుమెంటులా వుంటాడని వాళ్ళ కాలేజీ అమ్మాయిలు అనుకుంటారు. బీదవాళ్ళలో కూడా బావున్నవాళ్ళుంటారు అనడానికి అతనే చక్కని ఉదాహరణ.

అసలు హీరో, హీరోయిన్లు మొట్టమొదటి సారి కలుసుకోవడం చాలా గమ్మత్తుగా అంటే సినిమాటిక్‌గా జరిగింది. ఆ వేళ—అంటే వాళ్ళు కలుసుకున్న రోజు వాళ్ళ వూళ్లో యూత్ ఫెస్టివల్స్ జరుగుతున్నాయి. అసలా సందర్భం ఇంటర్నేషనల్ యూత్ ఫెస్టివల్ చేసేద్దామనుకున్నానుకాని ఎందుకో చెయ్యలేదు. ఆ ఫెస్టివల్‌లో ప్రైజులు ఎవరిస్తారు? ఎవరిచ్చినా ఒకటే. కాని హీరోయిన్ అమ్మకి కొంచెం పోర్షను యిద్దామనిపించి ఆవిడని స్టేజి ఎక్కించి ఆవిడచేత ప్రైజు లిప్పించేను. అలా

చెయ్యడంలో యింకో కుళ్లు ఎత్తుకూడా వుంది నాకు. తర్వాత్తర్వాత హీరోయిన్ హీరోని పెళ్ళాడతానన్నప్పుడు యీ మమ్మీ ఆ అమ్మాయికి కొంచెం "ఫర్"గా వుంటుందేమోనని ఆశ వుండేది నాకు. కాని కేవలం ఫస్టుప్రైజు లొక్కటే పెళ్ళికి అర్హతలు కావని నాకు అప్పట్లో తెలీదు. ఆ మమ్మీకి తెలుసు. మగవాళ్ళలో టెన్నిస్, స్విమ్మింగ్, క్రికెట్, డ్రామా, లైట్ మ్యూజిక్, హాకీ వగైరా అన్నిటిలోనూ ఫస్టు కాని సెకండు గాని ప్రైజులొచ్చేయిహీరోకి. ఆడవాళ్ళలో ఆ మిగిలిన ఫస్టు సెకండ్లు హీరోయిన్‌కి రావాలి కథల రూల్సుప్రకారం. (సినీమా రూల్సు కూడా అంతే నట!) నేను రూల్సు తప్పే మనిషినికాను కాబట్టి మా హీరోయిన్‌కి కూడా హీరో మిగిల్చిన ఫస్టు సెకండ్లు వచ్చేసేయి. వాళ్ళు ప్రైజులుపుచ్చుకున్నప్పుడు పడపడమని ఆడియన్సు కొట్టిన చప్పట్లు వాళ్ళ గుండెల్లో గణగణమని మ్రోగేయి.

"డయన్" ("డేన్" అనాల్ట. ఏఁవిఁటో! నాకు కథల పిచ్చి. మా వారికి ప్రొనౌన్సియేషను పిచ్చి) మీద వాళ్ళున్నప్పుడు వాళ్ళచూపులు చిక్కుకుపోయేయి. వాళ్ళ మాటలు మూగపోయేయి. అడుగులు అతుక్కుపోయేయి. ఇంకా యేవిఁటేఁవిఁటో యిలాగే చాలా చాలా జరిగేయి. ఎందుకో వాళ్ళిద్దరికీ చెప్పలేని గాభరా అనిపించింది.

ఆ చెప్పలేని గాభరా కొన్నాళ్ళకి చెప్పగలిగిన గాభరాగా మారింది. వాళ్ళు తిరగని తోటా, యీదని కాలువా లేవు. వెన్నెల రాత్రిళ్ళు ఇంద్రుడికీ, చంద్రుడికీ కనిపించకుండా కొబ్బరి తోటల నీడల్లో కలుసుకునేవారు. నీరెండలో బంగారపు రజనులాంటి ఏటి ఇసకలో గంటల తరబడి గుసగుసలు చెప్పుకున్నారు.

వాళ్లెంత అమాయకులంటే వాళ్ళ మధ్య పెరుగుతున్న పవిత్రప్రేమ వాళ్లు విడిపోయే వరకు వాళ్ళకు తెలీదు. పరీక్షలైపోయేయి. హీరో, కౌసల్యలాంటి తన తల్లి దగ్గరకు వెళ్ళిపోతాడు. యింక కొంచెం రోజుల్లో. అస్తమానూ హీరో, హీరోయిన్ అంటే బావుండదు. హీరోయిన్‌కి నేను పెట్టినపేరు సుజాత. ఆ పేరు చాలా డిగ్నిఫైడ్ గానూ, మాంచి ఎలిగెంట్‌గానూ వుంటుందని నా అభిప్రాయం. డాడీ పేరు అవినాశ్‌బాబు. మమ్మీ రాధామాయి. హీరో పేరే ఇండియాకి కాశ్మీరుసమస్యలా నాకో సమస్య అయి కూర్చుంది. మావిల్లలపేర్లకూడా నేనంత ఆలోచించలేదు. మా అత్తగారే పెట్టేసేరు. ఇతను నా హీరో కాబట్టి నేనే పెట్టాలి. పేరు బీదగావుండాలి. మంచిగా వుండాలి. కథ స్టైల్ తగ్గకూడదు. ఏం తోచక మావార్ని బతిమాలేను "బాబ్బాబు! మా హీరోకేదైనా మంచి బీదపేరు పెట్టమని". 'మంచి బీద' ఏఁవిఁటి నీ మొహం అన్నారు. బీదతనంలో మంచితనం కలిసి కనిపించాలి, విషాదంలో వినోదంలాగ అన్నారు. వెంటనే "అప్పల కొండ" అన్నారు. నా కా పేరు అసలు నచ్చలేదు. ప్రపంచంలో చాలా మంది అప్పలకొండలు వుండొచ్చును. కాని హీరోకి ఆ పేరు నచ్చదు. మళ్ళీ కొన్నాళ్ళు ఆలోచించి ఆఖరికి "రాము"అని పెట్టేను."రాము" మంచితనమే సూచిస్తుంది బీదవాళ్ళు కూడా పెట్టుకోవచ్చు.

సుజాత డాడీతో తమ పవిత్రప్రేమ గురించి చెప్పేస్తుంది. చెప్పి "మా వివాహానికి మీరు మనస్ఫూర్తిగా ఆశీర్వదించండి నాన్నా" అని కొండలు కరిగి వరదలైనట్టు, మహా నదులు మంచులా గడ్డకట్టుకొనేటట్టు అతి దీనంగానూ, అతి జాలిగానూ అడుగుతుంది. కాని అతను కొండాకాదు, నదీకాదు. కేవలం సుజాత తండ్రి. అతనేం అమాయకుడా? ఎంత మాత్రంకాదు. అంచేత చాలాసేపు ఆలోచించి "హీరోకి ఏ మాత్రం వుంటుంది ఆస్తి?" అని మేకపిల్లని తినబోయే ముందు "మీ అమ్మ, నాన్న బావున్నారా?" అని పరామర్శించిన పులిలా అంత కాజుఅల్‌గా అడిగేరు. నిజానికి ఆ ముక్క అడగడానికి అంత సేపు ఆలోచించ నక్కర్లేదు. కాని దేనికైనా ఆఖరికి పెళ్ళాన్ని కాఫీ యిమ్మని అడగడానికైనా సరే ఆలోచించి అడగడం గొప్పవాళ్ళ లక్షణం. ఆస్తి లెక్కలు ఇన్‌కంటాక్సు వాళ్ళకే అవుసరం కాని ప్రేమికులకి అక్కర్లేదనుకొంది ఆ అమ్మాయి. నిజానికి ఇన్‌కంటాక్సు లెక్కలు నకిలీవి. ప్రేమికులకి నిజం లెక్కలు కావాలి. ఇవన్నీ ఆ అమ్మాయికి తెలీవు. అంచేత తనకి తెలీదంది. మళ్ళీ కొంతసేపు ఊరుకొని "కనీసం ఒక్క కారైనా వుందా?"అన్నారు డాడీ. ఆస్తి అంచనాకి కారు బెరామీటరు లాంటిది.

నిజం చెప్పాలంటే హీరోకి ఇల్లంతా కారే. అతని గుడిసె ఎక్కడ కారుతుందో, ఎక్కడ కారదో చెప్పడం కష్టం. అతనికున్న ఆస్తి ఒక ముసలి తల్లి + గుడ్డిగేదె. దాని రక్తం, తన రక్తం కలిపి అమ్మి అతని తల్లి చదివిస్తోంది. ఇదంతా అవినాశ్‌బాబుగారికి తెలిసిన తర్వాత...

"వచ్చే జన్మలో నీ తండ్రిగా కాక, ఆ రామువెధవ తండ్రినైనాసరే, మీ పెళ్ళి జరగనివ్వను కాక జరగనివ్వను" అని ఫర్మ్‌గా చెప్పేరు. అంతే. ఆ అమ్మాయి హృదయం గాజుగ్లాసులా పగిలి ముక్కముక్కలైపోయింది. హీరో బీదవాడు కాబట్టి అతని హృదయం ముక్కలవలేదు. కొంచెం బీటువేసిందంతే. అయితే అతను దాన్ని చిల్లుపడిన సిలవరిగిన్నెని టంకంవేసి అతికినట్టు అతికేసుకున్నాడు. ఆ

తర్వాత వాళ్ళిద్దరి ఆఖరి సమావేశాలు వాళ్ళకంటె ఎక్కువ బాధపడి రాశేను. అతి పవర్‌ఫుల్ డైలాగ్సు చెప్పించేను-మతాలు మూఢుల సృష్టి అనీ! కులాలు కుళ్లువెధవల కుతంత్రాలనీ, డబ్బు పాపిష్టిదనీ, వాళ్ళది అమరప్రేమనీ, యింకా యిలాంటివే ఎవో మూడు పేజీల డైలాగులు చెప్పించేను. కాని, తర్వాత ఏంచెయ్యాలి? ఆ డైలాగుల్తో కథ అవదు కదా పేజీల ఖర్చు, చెయ్యిపీకేగాని. గబ్బిలాలు చెట్లనిపట్టుకొని వేళ్ళాడినట్టు నేను వాళ్ళని పట్టుకొని ఎంతకాలం వేళ్ళాడను? వాళ్ళని విడదియ్యడానికి నా మనసొప్పలేదు. కలపడానికి వాళ్ళ డాడీ వప్పుకోవడంలేదు. పిట్టలు రెండూ ఎగిరిపోవచ్చునుగాని కథకి పరువు తక్కువేమో. పైగా ఇలాంటి వెధవ కథలు రాసి ప్రజల్లో అవినీతిన పెంచుతున్నానని పాఠక మహాశయులు తిట్టొచ్చు. అంచేత ఇటుచూసి, అటు చూసి, వాళ్ళిద్దరికి చెరో గ్లాసుడు విషం పట్టేసి "అందరూ కలిసి బతుకుతారు. మనం కలిసి మరణిద్దాం" అన్న డైలాగుల్తో వాళ్ళని చంపేశేను. కథ పేరు "కన్నీటి కెరటం."

కథని ప్రముఖ పత్రికకి పంపేను. ఈ కథకి పుట్టుకవుంది, పూర్వం కూడా వుంది. కాని ఉత్తరం లేదు. అది పబ్లిష్ కాలేదు. ఇది జరిగి ఎన్నేళ్ళో అయిపోయింది. కాని అప్పట్లో ఆ డిజప్పాయింట్‌మెంటుకి మంచం పట్టేస్తానేమో అనుకున్నాను. కథ ఎందుకు పబ్లిష్ కాలేదో తెలీదు. మావార్ని అడిగి లోకువైపోవడం యిష్టంలేక మానాన్నని అడిగేను. ఆయన కథ చదివి, కొంత సేపు ఊరుకొని, ఎటో దూరంగాచూస్తూ "యు గ్రో ఇంటలెక్చువల్లీ" అన్నారు. అప్పట్లో నాకు ఆమాటల అర్థం తెలియలేదు. అంచేత కొన్నాళ్ళు మళ్ళీ కథల పూసుకి వెళ్ళలేదు.

ఆ తర్వాత కొన్నేళ్ళకి ఒక మిషనరీ స్కూల్లో ప్రైజు డిస్ట్రిబ్యూషన్‌కి వెళ్ళేను. మీటింగు మీటింగులాగే జరిగింది.

ఈ దేశం సుభిక్షం అన్నాడో ఖద్దరు నాలిక మనిషి. కాన్స్టిట్యూషనల్‌గా అందరికీ అవకాశం ఒకటే అన్నారింకెవరో. ఆ తర్వాత మాత్రం అచ్చు కథలో లాగే జరిగింది. ప్రైజు డిస్ట్రిబ్యూషన్లో చాలామంది ఆడపిల్లలకి ప్రైజులిచ్చేను. పాటల్లో, ఆటల్లో, చదువులో ఎంతమందో పుచ్చుకున్నారు. కాని అంతమందిలోనూ—తోడేళ్ళమధ్య లేడిపిల్లలా—నన్ను ఎక్కువ ఆకర్షించి, రాను రాను నన్ను కథల్లోనూ, కలల్లోనూ హంట్ చేసిన ఒక అమ్మాయి వుంది.

ఆ అమ్మాయికి మహావుంటే పది, పదకొండేళ్ళుంటాయేమో. ఆ అమ్మాయికి చదువులోనూ, ఆటల్లోనూకూడా చాలా ప్రైజులొచ్చేయి. నాచేత్తో నేనే యిచ్చేను కాబట్టి నమ్మాలి మరి.

గౌనుకున్న చింకిలన్నీ కనిపించకుండానే తొడుక్కుంది. చిరిగినదైనా ఉతికిన గౌనే తొడుక్కుంది. పులి నాకిన మేకపిల్లలా భయం భయంగా వుంది. ప్రైజు పుచ్చుకున్నప్పుడల్లా ఫీబిల్‌గా నవ్వుతూనే ఉంది. ఆ నవ్వుకంటే కూడా ఆ నవ్వులోవున్న డిఫీట్ నన్నెక్కువ బాధపెట్టింది. తర్వాత ప్రైజులిస్తున్నానే కాని మనసంతా ఆ అమాయ్మే తిరుగుతోంది. అమ్మాయి ఆ నా మనస్సుని బుల్‌డోజరు దున్నినట్లు దున్నేస్తోంది. ఆ అమ్మాయి మహా చదివితే, వాళ్ళ అమ్మ, నాన్న చదివించగలిగితే యింకో ఒకటి రెండేళ్ళు. ఆ తర్వాత...మీ ఎవరి ఇళ్ళలోనైనా పిల్లల్ని ఆడిస్తుంది. లేకపోతే మా ఇంట్లో అంట్లు తోముతుంది. బహుశా చెయ్యని నేరానికి — బీదదవడమే ఆమె నేరం — చెయ్యని దొంగతనాల బరువు, బాధ్యత మొయ్యవచ్చు. చిన్నప్పుడు చిల్లర డబ్బులు కొట్టేసిందనో, పెద్దయ్యేక స్టీలుగిన్నెలు ఎత్తుకుపోయిందనో నేనే అనుమాన పడవచ్చు. అనుమానపడే అవకాశం, హక్కు నాకున్నాయి. పడించుకోవలసిన బాధ్యత ఆమెకుంది.

ఆ అమ్మాయి అందగత్తెకాదు. నలుపే. కొంచెం అసహ్యంగానే వుంది, కాని ముళ్ళకొమ్మ చివర రంగుపువ్వులా ఆ అమ్మాయి జడకి మంచి రిబ్బను వేసుకుంది. ఆ అమ్మాయి ఆ రిబ్బను సంపాదించడానికి ఎన్ని బాధలు పడిందో, ఎన్ని చీవాట్లుతిందో, ఒకవేళ అది పారేసుకుంటే ఎంత బాధపడుతుందో. ఆ రిబ్బను ఎవరైనా లాగేసుకుంటే? చింకిగౌను పిల్లకి సిల్కురిబ్బను ఎలా వచ్చిందని ఎవరైనా దొంగతనం అంటకడితే? ఆ పిల్లకి మన పిల్లలకున్న అవకాశాలు—ఒకటైనా ఉందా? కేవలం యీ ఆలోచనలే. బహుశా పిచ్చివే అయుండవచ్చు! "రిబ్బనుముక్క" అన్న కథకి మూలం. అదే నా మొదటికథ. అందులో సిల్లీ సెంటిమెంటలిజం, పనికిరాని మంచితనం బోల్డుంది.

అన్నట్టు ఆ కథ పంపించే ముందు మా నాన్నకి చూపిద్దామనుకున్నాను. కాని యీసారి "యు గ్రో ఫిజికల్లీ" అంటారేమోనని భయపడి మానేశేను.

